క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణవేణి విద్యా సంస్థల చైర్మన్ రాజు సంగాని, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల పరిశీలన



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో రక్షిత మంచినీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకులను ఎంపీఈవో జావేద్‌హైమద్ మంగళవారం పరిశీలించారు. మంచినీటి సరఫరా, నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. ట్యాంకుల వద్ద పరిశుభ్రత పాటించాలని జీపీ కార్యదర్శి నవనీతను ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



మాక్లూర్: మండలంలోని ఢీకంపల్లిలో మండల పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ ఆధ్వర్యంలో పశువైద్యసిబ్బంది పశువులకు మంగళవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలో ఉన్న 568 పశువులకు టీకాలు వేసి, రైతులకు పశువుల పెంపకం, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వినీత, గంగాజమున, సుధీర్, శ్రీనివాస్, జైల్‌సింగ్, పుష్ప, గంగాధర్, లక్ష్మి, అహ్మద్ పాషా రైతులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నరసింహనాయుడు



పెర్కిట్: ప్రవాస భారతీయుల హక్కుల, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు నరసింహనాయుడు సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాదులో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎంతో ఎన్నారై పాలసీ గురించి చర్చించారు. తెలంగాణలో 25 మంది సభ్యులతో ప్రవాసీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి గల్ఫ్ దేశాలలో ప్రవాసి భారతీయులను ఆదుకోవాలని కోరారు. అలాగే బోర్డుకు జవాబుదారీగా మంత్రిని నియమించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ దీక్షా పరుల కోసం హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాజశేఖర్, రమణయ్య, డిష్ నరేందర్, అజయ్, చిటికేశి రఘు, దోని, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



డొంకేశ్వర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అందిస్తున్న రుణ సదుపాయంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని డొంకేశ్వర్ సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీలో 18 మంది మహిళలకు రుణంపై కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. రైతుల శ్రేయస్సుతో పాటు వారి కుటుంబాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సొసైటీ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కృష్ణ, డైరెక్టర్ పెంటన్న, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకుడు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ అధిగమించేందుకు..

నిజామాబాద్‌నాగారం: ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్ కోసం నీరు తప్పనిసరిగా ఉండాలి. వేసవి కావడంతో భూమిలో నీరు పూర్తిగా ఇంకిపోయి లోఓల్టేజ్ సమస్య వస్తుంది. తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు మంగళవారం టౌన్-3 పరిధిలో కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ సహకారంతో విద్యుత్ అధికారులు మున్సిపల్ ట్యాంకర్లతో నీళ్లు పోయించారు.

ఆలయాలు ముస్తాబు..

- నేటి శ్రీరామ నవమికి ప్రత్యేక ఏర్పాట్లు
- విద్యుద్దీపాలతో అలంకరణ



డొంకేశ్వర్‌లో ముస్తాబైన రామాలయం



బోధన్‌లో స్వామి వారి విగ్రహం

బోధన్‌టౌన్/ ఆర్మూర్‌టౌన్/ బోధన్ రూరల్/ బాల్కొండ/ వేల్పూర్/ రుద్రూర్/ డొంకేశ్వర్: శ్రీరామ నవమి వేడుకలకు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం నిర్వహించే శ్రీరామ నవమి వేడులకు ఉత్సవ, ఆలయ, గ్రామ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. బోధన్‌లోని శక్కర్‌నగర్ కాలనీలో ఉన్న కోదండ రామాలయం నేటి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆ ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని 8 నవంబర్ 1951లో నిర్మించగా పాలరాతితో సీతారామ లక్ష్మణ విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయంలోని విగ్రహాలు పశ్చిమాభిముఖంలో ఉండటంతో రెండవ భద్రాద్రిగా ఈ ఆలయం ప్రఖ్యాతిపొందింది. బుధవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సీతారాముల కల్యాణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్మూర్ పట్టణంలోని నవానాథ సిద్ధుల గుట్టపై ఉన్న రామాలయం శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సీతారామ కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో పందిరి వేశారు. గుట్టపైకి ఉచితంగా ఆర్టీసీ బస్సులు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బోధన్ పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరం, రాధాకృష్ణ మందిరం ప్రాంగణంలో అఖిల భారతీయ భగవద్గీతా ప్రచార మండలి బోధన్ శాఖ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బాల్కొండ మండలం కిసాన్‌నగర్, ముప్కాల్ మండలం రెంజర్లలో ఉన్న కోదండ రామాలయం, మెండోరా మండలం పోచంపాడ్‌లో ఉన్న కోదండ రామాలయం బుధవారం నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

వేల్పూర్ మండలంలోని వేల్పూర్, పడగల్, అంక్సాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, పచ్చలనడ్కుడ, లక్కోర గ్రామాలలో ఉన్న శ్రీరామాలయాలు శ్రీరామ నవమి ఉత్సవాల కోసం ముస్తాబయ్యాయి.

డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రామాలయం ముస్తాబైంది. ప్రాంగణమంతా పందిరి వేసి ఆలయానికి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణం, అన్నదాన, రథోత్సవ వేడుకలకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

మోస్రా మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 17 వరకు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు చిగురాల శ్రీనివాసాచార్యులు వెల్లడించారు. అలాగే ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు సీతారామ కల్యాణం, జాతర ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. మోస్రాలోని రామాలయానికి ప్రత్యేకత ఉంది. ఆలయంలో పూజలు చేస్తే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం.

ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్‌కు మరో షాక్

- కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు
- ఆర్మూర్ ఎంపీపీతో పాటు నలుగురు ఎంపీటీసీల చేరిక



ఎంపీపీకి కండువా వేస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్

ఆర్మూర్: ఆర్మూర్ బీఆర్‌ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఎంపీపీ పస్క నర్సయ్యతో పాటు నలుగురు ఎంపీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్‌తో పాటు పలువురు పట్టణ, మండల ప్రముఖులు కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో ఈ చేరికలను నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఆర్మూర్ మండలంలో ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ప్రస్తుతం ఎంపీపీ నర్సయ్య నాయకత్వంలో ఎంపీటీసీ సభ్యులు ఎంసీ గంగారెడ్డి, అనూష శ్రీనివాస్‌గౌడ్, లినితమహేశ్, కొక్కుల హన్మాండ్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా భూమన్న, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, మగ్గిడి దేవారెడ్డి, ఆలూర్ గ్రామ అధ్యక్షుడు మండల రజనీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు బాజాలు మల్లేశ్, కొత్తూరు సునీల్, మగ్గిడి దేవా రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు దేగాం ముత్యంరెడ్డి, మామిడిపల్లి మాజీ సర్పంచ్ జ్యోతి మారుతిరెడ్డి, రాజు, చిట్టి రెడ్డి, భూపేందర్, విజయ్, నవనీత్, సంజీవ్, ఉదయ్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనిదినాలు పెంచాలి



మాట్లాడుతున్న సారా సురేష్

కమ్మర్‌పల్లి: ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజులకు తగ్గకుండా పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని హాసకొత్తూర్‌లో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కూలీలకు జాబ్‌కార్డ్ ఇవ్వడంతో పాటు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నాయకులు బాలయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇంటికి రెండు ఇంటి నెంబర్లు



కమిషనర్‌కు విన్నవిస్తున్న బాధితులు

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆటోనగర్ కాలనీలో ఓ ఇంటికి బల్దియా అధికారులు రెండు ఇంటి నంబర్లను కేటాయించారని వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన నిరుపేద అయిన ఆడెపు వసంతకు ఆటోనగర్‌లో ఉన్న స్థలాన్ని 1998లో గత ప్రభుత్వం కేటాయించింది. వసంత 2010లో మృతి చెందడంతో ఆమె కుమారుడు ఆడెపు రవి ఇంటి స్థలాన్ని తన పేరున మార్చుకొని ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇటీవల మరో వ్యక్తి ఈ ప్లాట్ నాదని ఇంటి నెంబర్ కేటాయించాలని దరఖాస్తు చేసుకుంటే వార్డు బిల్ కలెక్టర్ తమ ఇంటికి మరో ఇంటి నంబర్‌ను కేటాయించారని బాధితుడు, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ కమిషనర్‌కు వివరించారు. అధికారులు స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



బోధన్‌లో..

నందిపేట్/ ఆర్మూర్ టౌన్/బోధన్ టౌన్: అగ్ని ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని నందిపేట అగ్నిమాపక కేంద్రం అధికారి మధుకర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నందిపేటలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, సూరజ్, డ్రైవర్ ఎండీ షఫీ, హోంగార్డు రఘు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మెగా టవర్స్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మెగాటవర్స్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు జెస్సు అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని ఎల్బీస్ నగర్ కాలనీలో ఉన్న లక్ష్మి సాయి అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సిబ్బంది అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్, సిబ్బంది, అపార్టమెంట్‌వాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు రూ.100కే ఓపీ వైద్యం



నిజామాబాద్‌నాగారం: పేద మహిళలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రూ.100కే ఓపీ వైద్యాన్ని అందిస్తున్నట్లు ప్రముఖ గైనకాలజిస్ట్ కవితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మజూర్ ఛాప్ బీడీ కార్ఖానాను సందర్శించి మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసాయి హాస్పిటల్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కవితారెడ్డి హెల్త్ ఫౌండేషన్ ద్వారా రూ.100కే ఓపీ వైద్యం ప్రారంభించామని, దీనికి తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి మహిళా అర్హులన్నారు. గుర్తింపు కార్డు కలిగి ఇన్‌పేషంట్‌గా ఉన్న మహిళలకు ఆస్పత్రి బిల్లులో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు కూడా రూ.100కే వైద్యం అందిస్తున్నామని, కార్డులు అందని వారు ఆస్పత్రికి వచ్చి వివరాలిస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సీ అండ్ డీ ఈవీఎంలను భద్రపరచడానికి అవసరమైన స్ట్రాంగ్ రూంను నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ మంగళవారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని పై అంతస్తు గదిని ఆయన పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు అనుగుణంగా గదిలో ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్‌తో పాటు డీటీ(ఎలక్షన్స్) శ్రీకాంత్, ఆర్‌ఐలు సంతోష్, ప్రభు తదితరులున్నారు.

వ్యవసాయ గిడ్డంగిని జీపీకి కేటాయించాలి



గ్రామ సభలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఎడపల్లి: మండలంలోని మంగళపహాడ్‌లో గ్రామ ప్రత్యేకాధికారి సందీప్ అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. సభలో పలు అంశాలపై చర్చించారు. రూర్బన్ పథకం ద్వారా నూతనంగా నిర్మించిన వ్యవసాయ గిడ్డంగిని ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘానికి అప్పగించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని దానిని సొసైటీకి కాకుండా గ్రామ పంచాయతీకి అప్పగించాలని గ్రామసభ ద్వారా గ్రామస్తులు రైతులు ఏకగ్రీవ తీర్మానం చేసి పంచాయతీ ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై రైతులు మాట్లాడుతూ.. ఎడపల్లి సొసైటీ వారు కలెక్టర్‌కు తప్పుడు నివేదిక సమర్పించి గ్రామంలో నూతనంగా నిర్మించిన గిడ్డంగిని స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని దానిని జీపీకి అప్పగించాలని కోరారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. రైతులు విన్నవించిన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

దేశ వ్యాప్తంగా మోదీ గాలి వీస్తోంది



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

భీమ్‌గల్: దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తోందని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లకు పైగా గెలుపొందుతుందని ఎంపీ అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలోని ముచ్కూర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటుతో ఎగుమతులు పెరిగి, మంచి ధర లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్ రెడ్డి, జిల్లా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు యోగేశ్వర నర్సయ్య, మండల నాయకుడు ఆరె రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

మోదీ అంటేనే నిజాయితీ..

– ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: మోదీ అంటేనే నిజాయితీ అని, ప్రపంచ దేశాల్లో భారత దేశానికి మోదీతోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 34వ వార్డు పరిధిలోని కాలనీల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలంటూ స్థానిక పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి, నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ద్యాగ ఉదయ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

మాక్లూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు అడవి మామిడిపల్లి గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రచారంలో పార్టీ జిల్లా నాయకుడు గంగోనే సంతోష్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఆర్మూర్: రైతుల అభివృద్ధి, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా పార్లమెంట్ కో-ఆర్డినేటర్ నూతుల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చినట్లుగానే పసుపునకు ప్రత్యేక బోర్డును తీసుకువచ్చారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి రైతులు నడుం బిగిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు చిట్టి భాజన్న, తేలు ఒడ్డెన్న, గుమ్ముల భాజన్న, చిట్టి నరేశ్, సిద్ధాపురం లింగన్న తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీని ప్రధాని చేస్తాం

రుద్రూర్: నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త పని చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు విఠల్ అన్నారు. చందూర్ మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటా బీజేపీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ సింగ్, మండల ఉపాధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు అంజి, జిల్లా ఐటీ వింగ్ జాయింట్ కన్వీనర్ సుమంత్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ విఘ్నేష్ రెడ్డి, బన్నీ రెడ్డి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు రాజు గౌడ్, వీరసారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



చందూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బొమ్మ రామ్‌కు సన్మానం

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌కు చెందిన యూట్యూబ్ సింగర్, రైటర్ బొమ్మ రామ్‌ను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. అమ్మ అనే పేరిట రాసిన పాటను గత నెలలో యూట్యూబ్‌లో రిలీజ్ చేశారు. నెల రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు పొందడంతో రామ్‌ను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. హకీమ్, గంగాధర్, మధుసూదన్, సురేందర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు తాగునీటి సౌకర్యం

రెంజల్: ఎండలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మాతృదేవోభవ ఫౌండేషన్ సభ్యులు చల్లని తాగునీటిని అందించారు. మండలంలోని బాగేపల్లిలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సర్పంచ్ పాముల సాయిలు పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం పూర్తయ్యే వరకు కూలింగ్ వాటర్ అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయాగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్ పాల్గొన్నారు.

నవీపేటలో ఈద్ మిలాద్

నవీపేట: రంజాన్ పండుగను విజయవంతంగా నిర్వహించుకున్నందుకు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఈద్ మిలాద్ ఉత్సవాలను నిర్వహించారు. స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్ గౌడ్, ముస్తాక్, మూసా, బాబు పాల్గొన్నారు.

సమాచారం..

20న కవి సమ్మేళనం

బోధన్: పట్టణ కేంద్రంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో ఈ నెల 20న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పంపా సాహితీ పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురాణే అజయ్ కుమార్, పబ్బ మురళి మంగళవారం తెలిపారు. ఉగాదిని పురస్కరించుకొని ఈ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మేళనాన్ని కవులు విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9346496587, 8500450540 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మైదాన్ (హిందీ)- 10.00, 10.25, లవ్‌గురు (తెలుగు)-01.50 శ్రీరంగనీతులు -7.40 గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ-తెలుగు)-5.00
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.00, 4.25, 10.50 ది ఫ్యామిలీ స్టార్ -01.00, 7.25
స్క్రీన్-3 –	బడేమియా ఛోటే మియా (తెలుగు)- 11.50, 6.30, గీతాంజలి మళ్లీ వచ్చింది - 3.25, 10.05
స్క్రీన్-4 –	గీతాంజలి మళ్లీ వచ్చింది - 10.15, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.20, 10.35 లవ్‌గురు-04.15, 7.25

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



బోధన్‌టౌన్: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ అన్నారు. పట్టణంలోని 4, 23, 24, 26 వార్డుల్లో మంగళవారం పర్యటించి పైప్‌లైన్ లీకేజీ పనులను పరిశీలించారు. తాగునీటి లీకేజీలను అరికట్టి మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట ఏఈ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఎరాజ్‌పల్లిలో మహా చండీయాగం

బోధన్‌రూరల్: ఎరాజ్‌పల్లిలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా బోయి కులస్తులు వేద పండితులతో మంగళవారం మహా చండీయాగం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం విగ్రహమూర్తుల ప్రాణప్రతిష్ఠాపన ఉంటుందని బోయి కుల సంఘం అధ్యక్షుడు సుట్టాకుల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో బోయి కుల సంఘం ఉపాధ్యక్షులు కర్రోల చిన్న లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మణ్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.